# ఇదం జగత్ !

ఆ పరగణాలో వాళ్ళని ఆది దంపతులు అని పిలచేవారు. "అభానికి, శుభానికి, ఎక్కడికైనా ఏ పనికైనా సరే వాళ్ళు యిద్దరూ కలిసి రావలసిందే. ఇద్దరిదీ ఒకటే మాట- ఒకటే ప్రాణం- భార్యాభర్తలు అంటె అల్లా ఉండాలి..." అందరి నోట యిదేమాట.

పిల్లలు - ఆ దంపతుల కడుపున పుట్టిన వాళ్ళే కద. మంచితనానికి- క్రమశిక్షణకు - సజీవ ఉదాహరణ అని అందరూ అనుకునే మాట.

కుటుంబమంతా సరస్వతీ వరప్రసాదులు, వారి వారి రంగాలలో నిష్ణాతులు- అజేయులు-

లక్ష్య సాధకులు, సర్వకార్య నిర్వహణలో సమర్థులు.

నగరం నడిబొడ్డులో ఇరవై నాలుగు గంటలు రద్దీగా వుండే ప్రాంతంలో వారి యిల్లు ఉన్నా - నాలుగు దిక్కులా పండ్లు, పూలచెట్లు, ప్రశాంతంగా- ఆశ్రమందాకా వుండేది.

"ఆయన పరమశివుడు- ఆవిడ కనకదుర్గ- ప్రాతః స్మరణీయులు. నిత్యం వందనీయులు...

ఆ మహానగరాన్ని ఒక్క చిన్న వార్త గగ్గోలు పరిచింది. ఎవరికీ నమ్మశక్యం కాలేదు. ఈ వార్తలు, పుకార్లు అపవాదులేమోనని ఒకటికి పదిసార్లు పదిమందిని విచారించారు. నిజమేనని తెలిసిన తరువాత దుఃఖించారు.

'పరమశివయ్యగారు మళ్ళీ పెళ్ళిచేసుకున్నారు' - ఇది మొదటి వార్త.

'ఆయన దగ్గర్నుంచి విడాకులు కోరుతూ దుర్గమ్మగారు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు' - యిది రెండో వార్త.

దగ్గరవాళ్ళు ధైర్యం చేసి అడిగారు 'ఇది నిజమేనా' అని.

ఇది ఇద్దరి దగ్గరనుంచి ఒకటే సమాధానం వచ్చింది 'నిజమే!'

'కలికాలం' అని పుణ్యాత్ములు అనుకుంటే, 'పోయేకాలం. ఇద్దరికీ మతి పోయింది' అని సన్నిహితులు బాధపడ్డారు.

"భార్యాభర్తలు అన్న తరువాత లక్ష విషయాలు ఉంటాయి. మగవాడు, చిత్త చాంచల్యం వల్లనో, ఏ కారణం వల్లనో తప్పు పని చేసి వుండవచ్చు. అంత

మాత్రాన ఆడకూతురు మగవాళ్ళు యింతేలే అని నచ్చచెప్పుకుని సంసారం కాపాడుకోనక్కర్లేదా? ప్రతి చిన్న విషయానికి రచ్చకెక్కితే ప్రపంచంలో ఎవరైనా కాపురం చేయగలరా? మహా మహా ఈశ్వరుడికే యిద్దరు భార్యలు వుండగా పార్వతీదేవి సహించి ఊరుకోలేదా? ఆవిడ కోర్టుకి వెళ్ళి విడాకులు కోరిందా? మనమేమన్నా వాళ్ళకన్నా అధికులమా- శక్తిమంతులమా?" అని పాతకాలపు అమ్మలక్కలు నోరునొక్కుకున్నారు.

"మీ నాన్నగారు మహాపండితులని విన్నాం. ఇంత రసికులని తెలియదు. అంటూ శివయ్యగారి కుమారుడు ఉమాపతిని వాళ్ళ స్నేహితుడు రామకృష్ణ అడిగాడు.

"మీ అమ్మగారు మీ నాన్నగారిని సరిగ్గా చూసుకోవటంలేదా" అని దుర్గమ్మగారి కూతురు శశిరేఖని కాలేజి ఫ్రెండ్ సునీత అడిగింది.

పిల్లలకి నాన్నగారి మీద కోపం, అమ్మమీద జాలి కలిగాయి.

శివయ్యగారు తనవారి మధ్యనే వుంటూ పరాయివాడుగా బ్రతకవలసి వచ్చింది.

క్షణం తీరికలేక పనులు సగం సగం చేస్తూ వాయిదాలు వేసుకునే న్యాయస్థానం దృష్టి వీరి సమస్యపై నిలిచింది. న్యాయస్థానానికి రావలసిందని తాఖీదు వచ్చింది.

నేరము యొక్క తీవ్రత, సమాజంలో నేరస్థులకి గల స్థానాన్ని దృష్టిలో పెట్టుకొని న్యాయస్థానం ఇలా ప్రశ్నించింది.

"మీకు యిటువంటి బుద్ధి ఎందుకు కలిగింది? ఒక భార్య వుండగా, భార్యకు తెలియకుండా మభ్యపెట్టి యింకొక స్త్రీని వివాహమాడటం నేరమని మీకు తెలియదా? ఈ నేరానికి శిక్ష జైలు శిక్ష అని మీకు తెలుసా?"

"తెలుసు."

"తెలిసే కావాలనే యీ నేరం మీరు చేశారా?"

"కావాలని చేయలేదు. కట్టుకున్న యిల్లాలిని మోసగించి యింకో స్త్రీతో సరసాలాడటం కోసం నేను యీ పని చేయలేదు."

"మరి యీ పని ఎందుకు చేశారు? మీరు అన్నీ తెలిసినవారు. హేయమైన యీ పని ఎందుకు చేశారు?"

"ఒక జీవుడికి ఊరట కలిగించటానికి. ఒక ఆత్మకు శాంతి కలిగించటానికి.'

"మేము మీలాగా పండితులము కాము. వేదాంతులము కాము. కోర్టువారికి అర్థమయ్యే భాషలో చెప్పండి. ఒక మహత్తర కార్యం సాధించటానికే తను యీ నేరం చెయ్యవలసి వచ్చిందని ప్రతి నేరస్థుడూ చెపుతాడు. ఆ మాటలు నమ్మడానికి

న్యాయస్థానం తెలివితక్కువదేం కాదు. శ్రీమతి కనకదుర్గ గారిని అగ్నిసాక్షిగా మీరు వివాహమాడారు. మంచి సంతానం కూడా కలిగింది. సమాజంలో మంచి పేరు వుంది. కాని అకస్మాత్తుగా మీరు లక్ష్మీకాంతం అనే ఆవిడను వివాహం చేసుకున్నారు. ఎందుకని?"

పరమశివయ్యగారు భార్యవంక చూశారు. జడ్జిగారి వంక చూశారు.

"లక్ష్మీకాంతం మాకు దూరపు బంధువు. ఆవిడ నాన్నగారిని మేమంతా మామయ్యా అని పిలిచేవాళ్ళం. ఆయన తరతరాలుగా ధనవంతుడు. మేము తరతరాలుగా పేదవాళ్ళం.

'ఇద్దరూ ఈడూ జోడూ బాగున్నారు. అమ్మాయిని శివయ్యకి యిస్తే బాగుంటుంది' అని ఎవరో పొరపాటున అన్నారు.

ఆ రోజు నుంచీ మా యిళ్ళమధ్య అడ్డుగోడలు లేచాయి. ఆ వూళ్ళో మా మనుగడ కష్టమయ్యింది. పొట్ట చేతపుచ్చుకుని యీ వూరు వచ్చాము. ఇక్కడే స్థిరపడ్డాము. బ్రతుకు గుంభనంగా గడుపుకుంటున్నాము. సిరిసంపదలు లేకపోయినా సుఖంగానే బ్రతుకుతున్నాము. గతాన్ని మరిచిపోయాను. పాలకుండలో విషం చుక్క పడ్డది. నాకు కష్టాలు ప్రారంభమయ్యాయి.

లక్ష్మీకాంతం చావు బ్రతుకులలో ఉన్నదని- నన్ను ఒక్కసారి చూడాలని అనుకుంటుంది. వెంటనే బయలుదేరి రావలసింది అని అభ్యర్థన.

మా యిల్లాలితో చెప్పి బయలుదేరాను. ఆవిడ ఏమి అభ్యంతరం చెప్పలేదు.

నేను చేసిన పొరపాటు- మా ఆవిడని వెంట తీసుకుని వెళ్ళకుండా- ఒంటరిగా వెళ్ళడమే.

అక్కడ పరిస్థితి హృదయ విదారకంగా ఉంది. లక్ష్మీకాంతానికి పెళ్ళి ప్రయత్నాలు చేస్తున్నప్పుడు ఆ పిల్లకు గుండె జబ్బు అని, పెండ్లి చేయకూడదని డాక్టర్లు చెప్పారని- లక్ష్మీకాంతం ఇంతకాలం కన్యగానే ఉండి పోయిందని- యావదాస్తికి ఆవిడే ఏకైక వారసురాలని- వారము రోజుల కంటె బ్రతకదని-

మనోవ్యధతో బాధపడుతోందని - ఆవిడకు మనశ్శాంతి చాలా అవసరమని-

ఈ వార్తలు ఏవీ కూడా - శుభవార్తలు కాదు. సుఖవార్తలు కాదు. వినగానే నాకు మనోవ్యాకులత, ఆందోళన కలిగాయి.

లక్ష్మీకాంతం ముఖంలో నన్ను చూడగానే సంతోషం కనిపించింది.

ఆరిపోయే దీపం క్షణకాలం రెపరెపలాడింది.

మంచం ప్రక్కన కూర్చున్న నా చేతిని తన చేతుల్లోకి తీసుకుంది. "నన్ను సుమంగళిగా పంపించు" అని అంది.

నాకు ఆ మాట అర్థమైయ్యేలోపలే డాక్టరుగారు ఆవిడని హడావిడిగా పరీక్ష చేస్తున్నారు. లక్ష్మీకాంతం దిండు కిందనుంచి ఏదో తియ్యటానికి ప్రయత్నం చేస్తోంది. ప్రక్కనున్న ఆవిడ ఆ వస్తువు తీసి యిచ్చింది.

'మంగళ సూత్రాలు'

లక్ష్మీకాంతం కళ్ళల్లో దీనత్వం, అలసట, ప్రార్థన. చాలా ప్రయత్నం చేసి మళ్ళీ అడిగింది.

"నన్ను సుమంగళిగా పంపించు."

ఆ మంగళ సూత్రాల వంక చూశాను. నా భార్య గుర్తుకు వచ్చింది. క్షణం తటపటాయించాను. ఆయుర్వేద వైద్యుడు ఆచార్యులుగారు మంగళ సూత్రాలు నా చేతిలో పెడుతూ,

"హంస ఎగిరిపోవటానికి సిద్ధంగా ఉంది. ఆ జీవుడికి ఈ చిన్న సంతృప్తి అన్నా కలగనివ్వండి" అన్నాడు.

లక్ష్మీకాంతం మెడలో మంగళసూత్రం కట్టాను. నా చేతిని తన చేతితో గట్టిగా పట్టుకుంది. కన్నీరు నిండిన కళ్ళతో నా వంక చూసింది.

ఆచార్యులుగారు భగవద్గీత తెరిచి పారాయణ ప్రారంభించారు. డాక్టరుగారు నా భుజం తట్టి నాకు నమస్కారం చేస్తూ 'ఐ యాం సారీ' అన్నాడు.

'అదృష్టవంతురాలు. పునిస్త్రీగా వెళ్ళిపోయింది' అని అక్కడికి వచ్చిన సువాసినులు అందరూ అన్నారు.

సుమంగళిగా, సువాసినిగా నా చేతులు మీదుగా లక్ష్మీకాంతం పంచ భూతాలలో కలిసిపోయింది.

ఒక అనాథ ప్రేత సంస్కారం చేస్తున్న భావనతోనే చేశాను. మంచి పని చేశాననే సంతృప్తి కలిగింది. కాని ఆ సంతృప్తి ఎక్కువ సేపు నిలవలేదు. లక్ష్మీకాంతం లాయరుగారు నన్ను కలిసి కాగితాలు యిచ్చారు. దాంట్లో సారాంశం : లక్ష్మీకాంతం తన యావదాస్తినీ నా పేర రాసింది సర్వహక్కులతో. నాకు ఆనందం కలగలేదు. ఒక శ్లోకం గుర్తుకు వచ్చింది.

ఉత్తమం స్వార్జితం విత్తం మధ్యమం పిత్రార్జితం
అధమం స్త్రీ ఆర్జితం...

ఇంకొక వాక్యం మనసులో మసలింది.

*అన్యార్జితం విత్తం సమూలం నశ్యతి!*

ఈ సొమ్ము నాకు అక్కర్లేదని అన్నాను.

'మీరు దీనిని తీసుకుంటే మరణించిన వ్యక్తి ఆత్మకు శాంతి కలుగుతుంది. ఈ సొమ్ము మీకు అక్కర్లేకపోయినట్టయితే ఏదైనా శాశ్వతమైన పుణ్యకార్యానికి కాని, సంస్థకు కాని యివ్వండి. ఒక వ్యక్తికి నిస్వార్థంగా సేవ చేసిన పుణ్యం మీకు వస్తుంది. మా క్లయింటు కోరికను తీర్చామనే సంతృప్తి మాకు కలుగుతుంది.'

ఆయన మాటలు నాకు నచ్చాయి. లక్ష్మీకాంతం ఆస్తి, ధనం ప్రేమ సమాజానికి యిచ్చేశాను. తల తడిమి చూసుకున్నాను. ఇంటికి తిరిగి వచ్చాను. ఇదంతా ఒక పీడకలలాగా మరిచిపోదామనుకున్నాను. అందుకనే ఎవ్వరితో చెప్పలేదు. బహుశః అదే నేను చేసిన నేరం కావచ్చును."

శ్రద్ధగా విన్న జడ్జిగారు ఒక ప్రశ్న వేసారు. "మీరు చెప్పిన విషయాలు ధృవపరచడానికి సాక్షులు ఎవరైనా వున్నారా?"

"నేను చెప్పిన వ్యక్తుల్లో ఎవరినైనా మీరు విచారించవచ్చును."

"మీరు వెళ్ళి బయట కూర్చోండి. అవసరమైతే పిలుస్తాను."

శివయ్యగారు బయట కూర్చున్నారు.

దుర్గమ్మగారి వంక చూసి జడ్జిగారు ఒకే ప్రశ్న వేశారు.

"అన్నీ తెలిసిన మీరు ఎందుకు యిటువంటి కఠోరమైన నిర్ణయం తీసుకున్నారు."

దుర్గమ్మగారి కంఠంలో చాలా కోపం కనిపించింది.

"ఆయన యింకో పెళ్ళి చేసుకున్నందుకు నేనేం బాధపడలేదు. కానీ జీవితమంతా దరిద్రంతో బాధపడ్డాను. తరతరాలకు సరిపోయే ఆస్తి తనంతట తాను వెతుక్కుంటూ వస్తే సిరి రా మోకాలొడ్డిన యీయన ఎంత మూర్ఖుడో నాకు అర్థమైంది. మహా పండితుడని నమ్మి యింతకాలం కాపురం చేశాను. మూర్ఖుడు అని తెలుసుకున్నాను. మూర్ఖుడితో నేను కాపురం చెయ్యలేను. నాకు విడాకులు కావాలి" అని ఆవేశంగా అంది.

జడ్జిగారు శ్రద్ధగా విన్నారు. ఆరు నెలలు వాయిదా వేశారు.

వాయిదాకు వాళ్లు రాలేదు. జడ్జిగారు నవ్వుకుని యింకొక ఆరునెల్లు వాయిదా వేశారు.

పార్టీలు రాకపోవటం వల్ల జడ్జిగారు కేసు విషయం పట్టించుకోలేదు. కానీ కుతూహలం ఆగక వారిని గురించి అడిగారు. సమాధానం విని ఆయన మనస్సులోంచి నిట్టూర్పు వచ్చింది.

"ఆయన పిల్లల దగ్గర వుంటున్నారు. ఆవిడ ఆయనను వదిలి వృద్ధుల ఆశ్రమంలో విడిగా వుంటోంది."